ప్రజాశక్తి

బుధవారం 13 సెప్టెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

యుజిడి పనులు వృథాయేనా?

రూ.500 కోట్లు డ్రెయినేజీ పాలు - నెరవేరని సిఎం జగన్ హామీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ప్రభుత్వ హయంలో చేపట్టిన భూగర్భ డ్రెయినేజి పనులను పూర్తిగా పక్కన పెట్టినట్టు తెలిసింది. ఇప్పట్లో ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. మరో నాలుగు నెలల్లో ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందని ఇందువల్ల ఇప్పటికిప్పుడు ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశాలు కన్పించడం లేదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు నాలుగు ఏళ్ల క్రితం అర్థాంతరంగా నిలిచిపోయాయి. మళ్లీ ఇంత వరకు ప్రారంభం కాలేదు. ఎప్పటికి ప్రారంభిస్తారో కూడా తెలియదు. గత ప్రభుత్వ హయంలో డ్రెయినేజి పైపు లైను నిర్మాణం వల్ల తవ్విన గుంతల వల్ల రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. గత రెండేళ్లలో కొన్ని రోడ్లు పునరుద్ధరించారు. ఇంకా కొన్ని చోట్ల రహదారులను పునరుద్ధరించాల్సి ఉంది.

సిఎం జగన్ గత ఏడాది అక్టోబరులో గుంటూరు వచ్చిన సమయంలో భూగర్భ డ్రైనేజిపనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భూగర్భ డ్రెయినేజిపనులకు రూ.230 కోట్లు కేటాయిస్తున్నట్టు సిఎం జగన్ చేసిన ప్రకటన

యుజిడి కోసం తవ్విన గుంత (ఫైల్)

ఆచరణకు నోచుకోలేదు. మొత్తం రూ.903.82 కోట్ల అంచనాలతో 2017 జనవరి 30న భూగర్భ డ్రెయినేజి పనులు ప్రారంభించారు. 2019 మే నెల వరకూ దాదాపు 50 శాతం పనులు జరిగాయి. టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం జరిగింది. 2019 మేలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పనులు పూర్తిగా నిలిపివేశారు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను కాంట్రాక్టరుకు చెల్లించింది. తిరిగిపనులు చేపడతామని చెప్పిన కాంట్రాక్టు సంస్థ 2020 నవంబరులో తిరిగి పనులు ప్రారంభించేందుకు

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అసమానతలు పెంచిన మోడీ

- వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న బిజెపిని ఎంత త్వరగా గద్దె దింపుతే అంత మంచిది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తాడేపల్లి

బిజెపి పాలనలో దేశం అధోగతిపాలైందని, ప్రధాని నరేంద్ర మోడీ నిరుద్యోగం, అసమానతలు పెంచి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేరని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన మోడీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి యువతను మోసం చేశారని విమర్శించారు. నల్లడబ్బు వెలికితీస్తానని పెద్ద నోట్లు రద్దు చేసి వందలాది మంది మరణానికి కారణమయ్యారని, పెద్ద కుబేరులు తమ దగ్గర ఉన్న నల్లడబ్బును తెలుపుగా మార్చుకోవడానికి నోట్ల రద్దు ఉపయోగపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి జమిలి ఎన్నికలు అక్కర్లేదని, ఈ విధానం అమలు చేయడం కూడా సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్రం వద్ద విస్తృత అధికారులు తన గుప్పెట్లో పెట్టుకుని నియంతృత్వ పాలన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మంపై గొడవ చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ సనాతన ధర్మం అంటే ప్రజలకు చెప్పి మద్దతు కోరాలని సవాలు విసిరారు. సనాతన ధర్మాన్ని పూర్తిగా నిర్మూలించినప్పుడే

▶ 2లో

మేయర్ కావటిపై నేడు సుప్రీంలో కేసు వేస్తాం

- ఇసుక ర్యాంపుల్లో అక్రమాలపై ఈడీ విచారించాలి
- జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

8లో

రాజకీయ యుద్ధానికి సిద్ధం కండి

టిడిపి శ్రేణులకు బాలకృష్ణ పిలుపు

ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమావేశం 2 లో

లోను కోసం వెళ్తే అత్యాచారయత్నం

ఫైనాన్స్ సంస్థ యజమానిపై ఎస్‌పికి యువతి ఫిర్యాదు

6 లో

పదును లేకున్నా.. అదును పోతుందని..

మిర్చి సాగుకు తంటాలు పడుతున్న రైతులు - నీటి ట్యాంకర్లను కొని మొక్కలకు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మిర్చి సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు ప్రస్తుతం ఆ మొక్కలు నాటేందుకు అదును దాటుతోందని ఆందోళనకు గురవుతున్నారు. నీటిని రూ.వేలు వెచ్చించి ట్యాంకర్ల కొని మిర్చి సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 20వ తేదీ లోపు తేజ రకం మిర్చి సాగుకు మంచి అదును అని, ఆ తర్వాత బాడిగ రకం వంటి ఇతర రకాల సాగుకు వచ్చేనెల 10-15 తేదీల వరకూ అవకాశం ఉన్నా అప్పటి వరకు ఆగితే దిగుబడులు అంత ఆశాజనకంగా ఉండవని రైతులు భావిస్తున్నారు. అందుకే ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నామని చెబుతున్నారు.

నాగార్జునసాగర్ జలాశయంలో ఆశించిన మేర నీరు లేకపోవడంతో ఆరుతడి పంటలు వేసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అయినా కొందరు రైతులు వర్షాల మీదే నమ్మకం పెట్టుకుని మిర్చి సాగు చేస్తున్నారు. అదును దాటడం, ఇటీవల కురిసిన వర్షాలకు నేల పదును కాకపోయినప్పటికీ సాగు ప్రయాత్నాలను కొనసాగిస్తున్నారు. సాధారణంగా ఎకరా విస్తీర్ణంలో మిర్చి మొక్క నాటే నాటికి దుక్కులు దున్నడం, ఎరువులు తదితర ఖర్చులు పోల్చుకుంటే అదనంగా రూ.10 వేలు వరకు ఖర్చులు అవుతున్నాయి. పొలంలో బావి మాదిరి గుంట తీసి ట్యాంకర్ ద్వారా ఓగేరు వాగు నుండి నీటిని తెచ్చుకుని అందులో పోస్తున్నారు. ఈ నీరు భూమిలో ఇంకిపోకుండా గుంతలో టార్పాలిన్ పట్టాల వేసుకుని నిల్వ చేసి మొక్కలు నాటుతున్నారు. నెల క్రితం ఇదే తరహాలో మొక్కలు సాగు చేసిన రైతులు మొక్కలు బతికించేందుకు ట్యాంకర్ నీరు రూ.1400 నుండి దూరాన్ని బట్టి రూ.2 వేలు వరకు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం ఆరుతడి పంటలకు నీరిచ్చినా ఇలా అత్యవసర పరిస్థితుల్లో పంట కాలం పూర్తయ్యే వరకు మొక్కలకు నీరు ఇవ్వాల్సివస్తే ఎకరాకు అదనంగా రూ.40-50 వేలు వరకు వెచ్చించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు పరిధిలో మిర్చి మొక్కలు నాటిస్తున్న రైతులు

నీటిని నిల్వ కోసం ఏర్పాటు చేసిన గుంత

వాగు నీటిని ట్యాంకర్ కు నింపుతున్న రైతు

యుజిడి పనులు వృథాయేనా?

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు. ఈ మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గం మంగళదాస్ నగర్, పరమాయికుంట, ఆర్‌టిసి కాలనీలో పనులు ప్రారంభించారు. వారంపాటు పనులు చేసి మళ్లీ పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. దాదాపు రెండున్నర ఏళ్లుగా పనులు ఆగిపోయినా మళ్లీ ఈ సంస్థను సంప్రదించిన నాథుడు లేరు. 10 విలీన గ్రామాల ప్రజలను కలిపి మొత్తం 10 లక్షల జనాభాకు ఈప్రాజెక్టు ఉపయోగపడుతుంది. లక్షా 45 వేల ఇళ్లకు డ్రైనేజి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. దాదాపు 70 వేల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు పైపు లైన్లు నిర్మించినా శుద్ధిప్లాంట్లు నిర్మాణం పూర్తికాకపోవడంతో అప్పట్లో కనెక్షన్లు ఇవ్వలేదు. మొత్తం 1083.72 కిలో మీటర్ల పైపు లైన్లు నిర్మించాల్సి ఉండగా 2019 ఫిబ్రవరి వరకు 505.05 కిలో మీటర్ల మేరకు పైపు లైను నిర్మించారు. 43,574 మ్యాన్ హోల్స్ నిర్మించాల్సి ఉండగా 20,376 నిర్మించారు. 27,044 ఇన్‌స్పెక్షన్ చాంబర్స్ నిర్మించాల్సి ఉండగా 12 వేల వరకూ నిర్మించారు. మొత్తంగా రూ.540 కోట్ల మేరకు పనులు జరిగాయి. గత ప్రభుత్వ హయంలో రాజకీయ వత్తిడి వల్ల పనులు వేగంగా జరగలేదన్న విమర్శలు వచ్చాయి. వైసిపి ప్రభుత్వం ఈ పనులను పూర్తిగా పక్కన పెట్టింది. అసలు ప్రాజెక్టును ఏ రూపంలోనూ పూర్తి చేయడానికి ఉన్నతాధికారులు దృష్టి పెట్టడంలేదు. ఈ ప్రాజెక్టును ఎటూ కాకుండా నిలిపివేయడం వల్ల రూ.550 కోట్ల వృధా అయినట్టేనని జిల్లా అధికారులు భావిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం మహాదీక్ష

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ మండల కేంద్రమైన చేబ్రోలులో మంగళవారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మహా దీక్ష చేపట్టారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఆమోదించాలని కోరుతూ ఈ దీక్షను ప్రారంభించామని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మురికిపూడి హృదయ రాజు మాదిగ తెలిపారు. శిబిరంలో ఎం.వెంకటేశ్వర్లు మాదిగ, డేగల బాబు, ఆలూరి బాబు వెంకటేష్, కోడూరు సంతోష్, పులి ప్రభుదాసు, మురికిపూడి రత్నరాజు, శుద్ధపల్లి మేరీ బాబు, ముళ్ళపూడి సతీష్,, కారుమూరి వినోద్, కారుమూరి సంజయ్ పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణం ఉండవల్లిలో బియ్యం కోసం రేషన్ దుకాణం వద్ద బారులుదీరిన కార్డుదారులు

రేషన్ వాహనాలు ఎక్కడ?

ప్రజాశక్తి - తాడేపల్లి

ఇంటిటికీ రేషన్ సరఫరా చేసే వాహనాలు తమ ప్రాంతాలకు రాకపోవడంతో పలువురు రేషన్ సరుకుల కోసం రేషన్ దుకాణాల వద్దకు పరుగులు పెడుతున్నారు. పట్టణంలోని ఉండవల్లి మంగళవారం ఈ పరిస్థితి కనిపించింది. రెండు నెలలుగా ఉండవల్లిలో రేషన్ వ్యాన్ రాకపోవటంతో తాము ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. దీని పై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాజకీయ యుద్ధానికి సిద్ధం కండి

టిడిపి శ్రేణులకు బాలకృష్ణ పిలుపు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో వైసిపితో టిడిపికి రాజకీయ యుద్ధం ప్రారంభమైందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. మంగళవారం గుంటూరులోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా టిడిపి సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి కార్యకర్తా సుశిక్షితులైన సైనికుల్లా పోరాడాలన్నారు. సిఎం జగన్ పరిపాలనను గాలికొదిలేసి ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. 16 నెలలు జైల్లో ఉన్న జగన్ 16 నిమిషాలైనా చంద్రబాబుని జైల్లో పెట్టాలనుకున్నారని, లోకేష్‌తో పాటు మరికొందరు నాయకులపై కేసులు పెట్టడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. నేతలు, కార్యకర్తలెవ్వరూ కేసులకు భయపడాల్సిన పనిలేదన్నారు. ప్రజలు కూడా మౌనంగా ఉండకుండా రోడ్లపైకి రావాలన్నారు. ఊరకుక్కలు ఏదో మొరిగితే భయపడాల్సిన పనిలేదన్నారు. నేను విగ్గు పెట్టుకున్నాని ఎవరో ఏదో వాగాడని, నా జీవితమే తెరిచిన పుస్తకమని నా విగ్గు సంగతి ఎందుకని ప్రశ్నించారు. దావోస్ వెళ్లిన ప్రతిసారి చంద్రబాబు వేల కోట్ల పెట్టుబడిల ఒప్పందాలు చేసుకున్నారని, సిఎం జగన్ ఒకేసారి వెళ్లి మోహం వేలాడేసుకుని వచ్చి పరువు తీశారని ఎద్దేవ చేశారు.

సమావేశంలో పాల్గొన్న వైసిపి బహిష్కృత ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ చంద్రబాబుని ఫ్యాక్షనిస్టు, నేరగాడిలా అరెస్టు చేసి తరలించారని, అయినా చంద్రబాబు అదరలేదని, కార్యకర్తల్లో ధైర్యం నింపారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి భూస్థాపితం కావడం ఖాయమన్నారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. పులి ఒక అడుగు వెనక్కు వేస్తే బయపడినట్లు కాదన్నారు. ఫ్యాక్షనిస్టు పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వ బూటకపు కేసులకు భయపడేది లేదని, అరాచకాలపై పోరాటం ఆపేది లేదని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నేరస్తుడి పాలనలో రాష్ట్ర భవిష్యత్తు ఏమవుతుందో అని ప్రజలంతా ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన చేతకానివాడు సిఎం అయితే ప్రజలకు అన్ని కష్టాలేనన్నారు. పోలీసులకు భయపడి వెనక్కి తగ్గితే పార్టీకి, నాయకులందరికీ నష్టం జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చిన దగ్గర్నుంచి జగన్ తట్టుకోలేకపోతున్నారని.. ఓర్చుకోలేక అణచివేతలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలనే దుర్మార్గపు ఆలోచనకు జగన్ వచ్చారని మండిపడ్డారు. యువగళంతో ప్రజల మధ్య లోకేష్ మాస్ నాయకుడిగా ఎదిగారని.. అది చూసి జగన్ తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి బరితెగించి చంద్రబాబుపై అక్రమ కేసులతో జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా రాళ్ల దాడి చేశారన్నారు. గతంలోనూ నందిగామ, అమరావతి, యర్రగొండపాలెంలోనూ వైసిపి రాళ్లదాడికి పాల్పడిందని గుర్తు చేశారు. చంద్రబాబు, లోకేష్‌ను తొక్కేస్తామని చెబుతున్న వారినే ప్రజలు పాతాళానికి తొక్కేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ వ్యవస్థలను ప్రభావితం చేస్తూ బయట తిరుగుతుంది ఎవరో విజయసాయిరెడ్డి గుర్తించుకోవాలని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఏ తప్పు చేయలేదు కాబట్టే ఈడి అధికారులు ఏం చేయలేకపోయారని.. ఇదే కేసులో ఈడి అరెస్టు చేసిన వారికి బెయిల్ కూడా వచ్చిందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సంబంధం ఉన్న అధికారులను పక్కనబెట్టి.. సంబంధం లేని చంద్రబాబుపై కుట్రపూరితంగా కేసు బనాయించారని విమర్శించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు తప్పేమీ లేదని అప్పటి ఆర్థికశాఖ మాజీ ఉన్నతాధికారి పివి రమేష్ స్పష్టంగా చెప్పినా దానిపైనా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవస్థలను ప్రభావితం చేయడం దేశానికి, ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని అన్నారు. వ్యవస్థలపై నమ్మకంపోతే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఉందన్నారు. వ్యవస్థలను ప్రభావితం చేయబట్టే చంద్రబాబుకు రిమాండ్ విధించారని రాష్ట్రంలో ఉన్న ప్రతిఒక్కరూ చర్చించుకుంటున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో కేంద్రం కూడా జోక్యం చేసుకోవాలని లేకపోతే కేంద్రాన్ని కూడా అనుమానించాల్సి ఉంటుందని చెప్పారు. సిఎం జగన్ దుర్మార్గాలపై గవర్నర్, కేంద్రం జోక్యం చేసుకుని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు సహా ముఖ్యనేతలను జైళ్లకు పంపించి ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంలో జగన్ ఉన్నారని.. ఆ పన్నాగాలు సాగవన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, జి.వి.ఆంజనేయులు, పార్టీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకరరావు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి బాలకృష్ణ

జేసీతో సమావేశమైన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు

ఆహార భద్రతా చట్టం అమలుపై కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు తీరును తెలుసుకునేందుకు భారత ప్రభుత్వం తరపున సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ అండ్ స్టడీ అనే సంస్థ వారు మంగళవారం గుంటూరు నగరంలోని ఐదు రేషన్ షాపులు తనిఖీ చేశారు. ఆయా షాపులలో ప్రజాపంపిణీ వ్యవస్థ అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద ఉన్న లబ్దిదారులతో మాట్లాడి వారికి అన్నీ సక్రమంగా చేరుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లను పరిశీలించి, అక్కడి పనివిధానం, ఆన్‌లైన్ వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో సమావేశయ్యారు. జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు గురించి తెలుసుకున్నారు. జెసి చట్టం అమలు, పౌరసరఫరాలపై వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కారం, విజిలెన్స్ కమిటీలు వాటి పనితీరు గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలిపద్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

అసమానతలు పెంచిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ప్రజాస్వామ్యం పరిడిల్లుతుందని అన్నారు. ప్రజలందరికీ సమభావం కోసం పని చేయాలని బిజెపికి సూచించారు. ఇప్పుడున్న రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వ్యవస్థలను నాశనం చేస్తున్న బిజెపి ఎంత తొందరగా గద్దె దిగితే అంత మంచిదన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ జాతీయ ఉన్మాదాన్ని బిజెపి రెచ్చగొడుతోందని, చంద్రయాన్‌కు కూడా బిజెపి మతం రంగు పులుముతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పూల్వామా ఘటనను ఉపయోగించుకుని 43 మంది సైనికులు మృతికి మోడీ కారణమయ్యారని, సైనికుల ప్రాణాలు పణంగా పెట్టి అధికారంలోకి వచ్చారని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదిర్శ పాశం రామారావు మాట్లాడుతు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. బిజెపిని సామాన్య ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్న సంగతిని ఈ మూడు పార్టీలు గుర్తించాలన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలన్నీ కమ్యూనిస్టుల పోరాటాల వల్లే వచ్చాయని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో వేలాది మందికి ఇళ్లు వేయించిన ఘనత సిపిఎంకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 14 వేల మంది ఇళ్లస్థలాలు, ఇళ్లపట్టాలు లేని వారు ఉన్నారని, వారందరికీ స్థలాలు, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కడ నివశిస్తున్న పేదలకు అక్కడే పట్టాలు ఇవ్వాలని, వివాదంలో ఉన్న రాజధాని స్థలాల జోలికి వెళ్లవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేయడం మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, ఇ.అప్పారావు, ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జెవి రాఘవులు, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు డి.శ్రీనివాసకుమారి పాల్గొన్నారు.

దుస్తులకు నిప్పంటుకొని మహిళ మృతి

ప్రజాశక్తి - తెనాలి

ప్రమాదవశాత్తు నైటీకి నిప్పంటుకుని మహిళ మృతి చెందిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేటలో అపార్ట్‌మెంట్‌లో పి శివకుమార్, రాధ (63) దంపతులు నివసిస్తున్నారు. సోమవారం ఉదయం లేచిన రాధ వంట చేసేందుకు స్టవ్ వెలిగించింది. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు ఆమె నైటీకి మంట అంటుకుంది. గాయపడిన రాధను తెనాలి వైద్యశాలకు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నులకపేటలో భారీ కొండచిలువ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళవారం నులకపేటలో జనావాసాల మధ్య భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. అరుపులు కేకలతో ఆప్రాంతమంతా దద్దరిల్లింది. సుమారు అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానికులు తేరుకుని స్థానికంగా పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించారు. కొండచిలువ పట్టుకుని తీసుకుని వెళ్లడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 31,804
మిర్చి ఎగుమతి	: 30,618
మిర్చి నిల్వ	: 10,664

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,500 - 23,500
నెం.5	16,000 -18,500
341	11,500 - 22,000
సూపర్ 10	11,000 - 19,500
	నాన్ ఎసి
తేజ	9,500 - 24,000
బడిగి	10,000 - 26,000
దేవనూరు డీలక్స్	9,500 - 26,000
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	13,000 - 22,000
341	16,000 - 23,000
273	16,000 - 16,000
సూపర్ 10	18,800 - 18,800
తేజ	12,500 - 23,500
బడిగి	16,500 - 24,500
దేవనూరు డీలక్స్	17,500 - 20,000
తాలుకాయలు	5,000 -13,000

మందుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు

నమూనాలు సేకరణ - ఫిజిషియన్ శాంపిల్ పట్టివేత

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రముఖ మెడికల్ షాప్ అధినేత బచ్చు సత్యనారాయణ అలియాస్ ప్రవల్లిక సత్యంకు చెందిన మల్లమ్మ సెంటర్ వద్ద గల మందుల దుకాణంపై మరియు గోదాముపై మంగళవారం జిల్లా స్థాయి అధికారులు బందం మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్స్ డైరెక్టర్ డి. లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ నరసరావుపేట మెడికల్ సంపెల్స్ అధికంగా అమ్ముతున్నారని అధికారులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు దాడులు చేపట్టామని అన్నారు.కాగా సత్తెనపల్లి రోడ్డు లో గల ప్రవల్లిక సత్యం దుకాణంతో పాటు పలు దుకాణాలలో దాడులు నిర్వహించి నమూనాలు సేకరించామన్నారు. అదే విధంగా మల్లమ్మ సెంటర్ వద్ద గల మేదర బజార్‌లో ఓ వ్యక్తి ఇల్లు అద్దెకు తీసుకొని లక్షల రూపాయల విలువ చేసే మెడికల్ శాంపిల్స్ నిల్వ చేసి అమ్మకాలు చేస్తున్నట్లు అదికారులు తెలిపారు.సదరు వ్యక్తి మల్లమ్మ సెంటర్ లోని మణి కష్ణ అనే మెడికల్ దుకాణం లో పని చేస్తూ ఉంటాడు అని అదికారులు తెలిపారు.లక్షల రూపాయిల విలువ చేసే భారీ మెడికల్ శంపెల్స్ ఎంత పెద్ద మొత్తం లో దొరకటం ఇదే మొదటి సారి అని డ్రగ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పట్టుబడిన శ్యాంపిల్ మందులు

అధైర్య పడొద్దని లోకేష్ చెప్పారు

ప్రజాశక్తి - తుళ్లూరు

నియోజక వర్గం లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని నారా లోకేష్ భరోసా ఇచ్చారని అమరావతి దళిత జెఎసి, టిడిపి నాయకులు పులి చిన్నా చెప్పారు. రాజమండ్రి సెంట్రల్ జైల్ వద్ద లోకేష్‌ను పులి చిన్నా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పులి చిన్నా చంద్రబాబు అరెస్ట్, తదనంతరం నియోజక వర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి లోకేష్ కు వివరించారు. ఎవరెన్ని అక్రమ కేసులు పెట్టినా చంద్రబాబు తలొగ్గరని, నాయకులు, కార్యకర్తలు కూడా ఏ మాత్రం నిరుత్సాహ పడవద్దని లోకేష్ సూచించారని చిన్నా చెప్పారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నివాళులర్పించిన చదలవాడ తదితరులు

కుటుంబ కలహాలతో నరసరావుపేట మండలంలోని పాలపాడు గ్రామానికి చెందిన కొలికొండ ఆంజనేయులు (32) మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఆంజనేయులు టిడిపి అభిమానిగా నరసరావుపేట మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ , టిడిపి నాయకులు పులిమి రామిరెడ్డికి అనుచరుడిగా వ్యవహరించేవారు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ కడియాల వేంకటేశ్వర్లు తదితరులు ఆంజనేయులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి బార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ మాట్లాడుతు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లి బ్రహ్మయ్య, పులిమి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణదారులను భయపెడుతున్న గిరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో భవన నిర్మాణదారులనుంచి ఎమ్మెల్యే మద్దాలి గిరితోపాటు పలువురు వైసిపి నేతలు వసూళ్లకుపాల్పడుతున్నారని టిడిపి నాయకులు ఈరెంటి వర ప్రసాద్ బాబు హెచ్చరించారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ సోమవారం జరిగిన బంద్ లో ఎమ్మెల్యే మద్దాలి గిరి, మేయర్ కావటి మనోహర్ నాయుడు రౌడీయిజం చేశారని 144 సెక్షన్ ఉల్లంఘించారని వీరిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయంఅన్నారు. ఈమేరకు ఫిర్యాదు చేసిన టిడిపి ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్రపై మద్దాలగిరి అవాకులు, చెవాకులు మానుకోవాలన్నారు. కోవెలమూడిరవీంద్ర సెటిల్‌మెంట్స్ చేస్తున్నారని అవాస్తవాలు చెబుతున్నారని అన్నారు.. 2019 లో టిడిపి తరుపున గెలుపొంది రాజీనామా చేయకుండా నిసిగ్గుగా వైసిపిలోకి వెళ్లారని అన్నారు. వైశ్యులను ఎమ్మెల్యే ముస్తాఫా ఇబ్బంది పెడితే ఇటీవల వాసవి క్లాత్ మార్కెట్ విషయంలో మీరే రాజి చేసుకోండి అని చెప్పిన మద్దాలి గిరి, నేడు వ్యాపారుల కోసం నేను ఉన్నాను అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. విలేకరులసమావేశంలో వలివేటి కృష్ణ తల్లమ్ శేఖర్,సత్యనారాయణ, సికాకొల్లి అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం డాక్యుమెంట్లు పోయినవి

పల్లె వెంకటసుబ్బారావు తండ్రి సాంబయ్య వేమవరం గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరుజిల్లా. వెంకటసుబ్బారావునైన నేను వేమవరం నుండి ఫిరంగిపురం వైపు 7-9-2023న ప్రయాణిస్తుండగా నా పొలం దస్తావేజులు తప్పిపోయినవి. ఎంత వెదికినా కనిపించలేదు. తప్పిపోయిన పత్రాల ఆధారంగా ఎవరితోను ఎలాంటి లావాదేవీలు జరపకూడదని దీని ద్వారా తెలియపరచడ మైనది. ఎవరైనా లావాదేవీలు జరిపి వుంటే 7 రోజుల లోపు పై అడ్రస్‌కు తెలియపరచ గలరు. గుటూరు రెవెన్యూ డివిజన్, వేమవరం సర్వే నెం. 39, డాక్యుమెంట్‌నెం. 1128/1978లో 50 సెంట్లు, 1129/1978లో 1.00 ఎకరం పొలం. వీటికి హద్దులు : తూర్పు : నా తాలూకు నిల్వ భూమి, పడమర : రెడ్డిబత్తుల లింగారెడ్డి గారి భూమి, ఉత్తరం : బుర్రముక్కల సాంబిరెడ్డి, దక్షిణం : కేసరి రామాంజమ్మ. సర్వే నెం. 40/2, డాక్యుమెంట్ నెం. 944/1995లో 1.00 ఎకరం, సర్వే నెంబరు 40లో డాక్యుమెంట్ నెం. 413/1981లో 0.95 సెంట్లుకు హద్దులు : తూర్పు : తారురోడ్డు, పడమర : నా తాలూకు నిల్వభూమి, ఉత్తరం : మోపర్తి కోటేశ్వరరావు వగైరాలు, దక్షిణం : ఆళ్ళ వెంకటేశ్వరరెడ్డి వగైరాలు కలరు. సర్వే నెం. 39,40/2, 40లలోని ఒరిజినల్ డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు పోయినవి.

తేది:12-9-2023

పల్లె వెంకట సుబ్బారావు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు పెండ్యాల నాగమురళి S/o ప్రసాదరావు, R/o కంకణాలపల్లి గ్రామం, సత్తెనపల్లి మండలం, పల్నాడుజిల్లా అను వారి నుండి తగు సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు తన దిగువ షెడ్యూలు దాఖలా ఖాళీ స్థలం యొక్క లింక్ దస్తావేజులు సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ నం.1674/1993 తేది : 6-4-1993 మరియు నెం.900/1987 తేది: 29-4-1987 లను ఫొటోస్టాట్ కాపీలు పొందుటకు తీసుకెళ్ళ క్రమంలో సత్తెనపల్లి పట్టణంలోని బస్‌స్టాండ్ సెంటర్ నందు ది. 5-8-2023న పోగొట్టుకోవడమైనది. మా క్లయింటు సదరు దస్తావేజును ఎంత వెదికిననూ దొరికి యుండలేదు. కావున ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పై చెప్పబడిన విక్రయ దస్తావేజులు నెం. 1674/1993 తేది: 6-4-1993 మరియు నెం. 900/1987 తేది: 29-4-1987 ఎవరికైనా దొరికిన యెడల ఈ నోటీసు తేది నుండి ఏడు రోజులలోపు నా క్లయింటును వారి మొబైల్ (98856 17418) ద్వారా సంప్రదించి కాని లేక ఈ క్రింది చిరునామాలో సంప్రదించి అయిన ఇవ్వవలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు

సత్తెనపల్లి మండలం, కంకణాలపల్లి గ్రామ డి.నెం.79 నందు చ.గ. 92.0లు ఖాళీ స్థలమునకు హద్దులు.
తూర్పు : సర్కారు బజారు అ.16.0లు
పడమర : సర్కారు బజారు అ. 14.0లు
ఉత్తరం : పచ్చా రామస్వామి వగైరాల స్థలం. అ.54.0లు
దక్షిణం : నా తాలుకు స్తలం అ. 56.0లు

వినుకొండ
ది.11-9-2023

ఇట్లు
సయ్యద్ మహమ్మద్ ఖాసీమ్
అడ్వకేట్, కొత్తపేట,
వినుకొండ. సెల్ : 9030214799

వేలం ప్రకటన
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
EP 2/2023 in OS 83/2019

Between :
Vaka Karuna, Tenali ... D.Hr
And
Chavali Madhavi @ Nadendla Madhavi .... J.Dr.

పై నెంబరు ఇ.పి.లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా జెడిఆర్ యొక్క స్థిరాస్తిని పై కోర్టువారిచే ది. 29-9-2023వ తేదీ ఉదయం 10-30 గం.ల లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూల్

Item No.1:
Guntur District-Kollipara Sub District-Chakrayapalem Panchayat Area Davuluru, Chakrayapalem Village D. No. 21B/3 Ac.0-09 Cents out of it, an extent of 121 Sq. Yards or equivalent to 101-15 Sq. Meters of Vacant site bearing Door No. 1-34.
East : Yarramsetty Chennakesva Rao's Land 48 Links
South : Dadi Venkateswarlu's Land 50 Links
West : Pothana Sambasiva Rao's Land 48 Links
North : Kammela Sambasiva Rao's Land 53 Links
Within these boundaries an extent of 121 Sq. Yards or equivalent to 101-15 Sq. Meters of Site and building therein bearing Door No. 1-34.
Amina Value : Rs. 8,00,000/-
D.Hr. Value of Rs.4,00,000/-

Item No.2:
Guntur District-Kollipara Sub District-Kollipara Mandal- Chakrayapalem Panchayat Area, Davuluru, Chakraya palem Village D. No. 216/3 Ac.0-09- Cents out of it, an extent of 121 Sq. Yards or equivalent to 101-15 Sq. Meters of Vacant site.
East :Yarramsetty Chennakesava Rao's Property 46 Links
South : Chavali Madhavi's Property 53 Links
West : Pothana Punnaiah's Property 46 Links
North: Naralasetty Srinivasa Rao's Property 55-6 Links
With in these boundaries an ex;ent of 121 Sq. Yards or equivalent to 101-00 Sq. Meters of Vacant Site.
Amina Value : Rs. 2,50,000/-
D.Hr. Value of Rs.2,00,000/-
Sale Date : 29-9-2023
Further Hearing : 9-10-2023

నోట్ : ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు లేవు
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

Darisi Siva Koteswara Rao,
Advocate for DHR, Tenali
Cell : 94406 31520

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరుజిల్లా, మేడికొండూరు మండలం, మేడికొండూరు గ్రామం కాపురస్తుడు అమిరినేని వెంకట సుబ్బారావు కుమారుడు రాంబాబు నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది. షెడ్యూలు ఆస్తిని పాములపాటి సుబ్బమ్మ పేరున వారి భర్తగారైన పాములపాటి అంకమ్మ ది.06-01-1931న ద.నెం. 5/1931గా సెటిల్‌మెంటు దస్తావేజు వ్రాయించిన దరిమిలా ఎటువంటి లిఖిత పూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా 50 సం॥ల క్రితం మరణించగా వారి పెద్దకుమారుడైన వెంకయ్య, భార్య సీతారావమ్మ, 3వ కుమారుడైన యల్లమంద, ఆయన భార్య శారద నిస్సంతువులుగా మరణించారు. వారి 2వ కుమారుడైన పాములపాటి రోశయ్య భార్య తులశమ్మ మరణానంతరం వారి కుమార్తె సీతామహాలక్ష్మి కూడా మరణించినది. తదుపరి 1) అమిరినేని వెంకట్రావు భార్యయున్నూ, పాములపాటి అంకమ్మ మరియు పాములపాటి సుబ్బమ్మ కుమార్తెయున్నూ అయిన పార్వతమ్మ, పాములపాటి రోశయ్య సంతతి 2) తిరుపతిరావు 3) నాగేశ్వరరావు, 4) కడియాల సాంబశివరావు భార్య సామ్రాజ్యం 5) అమిరినేని సుబ్బారావు భార్య ధనలక్ష్మి గారలు ది. 28-08-2019న నా క్లయింటు అమిరినేని వెంకట సుబ్బారావు కుమారుడు రాంబాబు పేరిట క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిని దఖలు దస్తావేజు నెం. 2883/2019, ఫిరంగిపురం రి.కా. నందు రిజిస్టరు చేసియున్నారు. అమిరినేని రాంబాబు సదరు షెడ్యూలు ఆస్తిని బ్యాంకు నందు గాని, ఆర్థిక సంస్థల నందు గాని తనఖాగా వుంచి రుణం పొందుటకు తగిన ఏర్పాట్లు చేయుచున్నారు. దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, హక్కులు ఉన్న యెడల ఈ దిగువ చిరునామాకు నేటి నుండి 7 రోజుల లోపల తగిన వివరములతో తెలియపరచవలయును. లేని యెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాదపు ఆస్తి అని యెంచి మా క్లయింటు బ్యాంకు నందు గాని, ఆర్థిక సంస్థలందు గాని షెడ్యూలు ఆస్తిని తనఖాగా వుంచి రుణం పొందగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు మా క్లయింటును గాని, షెడ్యూలు ఆస్తిని గాని బద్దులను చేయజాలవు.

షెడ్యూలు

నరసరావుపేట రి.డి., ఫిరంగిపురం స.డి., మేడికొండూరు మండలం, మేడికొండూరు పంచాయతీ గల మేడికొండూరు తాలూకు డి.నెం. 315 రు, య.30.06 సెంట్లు మింజుమలె, డోరు నెం. 162, అసెస్మెంటు నెం. 587 గల ఇల్లు స్థలమునకు హద్దులు : తూర్పు : రాకపోకల బజారు వైపు కొలత-9 గజములు, దక్షిణం : పంచాయతీ బజారు వైపు కొలత - 19.1/4 గజములు, పడమర : పంచాయతీ బజారు వైపుకు కొలత - 9.1/4 గజములు, ఉత్తరం : చేబ్రోలు రమాదేవి ఇంటివైపు కొలత - 20.1/4 గజములు, ఈ నాలుగు హద్దులలోగా వున్న 180.21 చ.గ.లు లేక 150.67 చ.మీ.లు స్థలమున్నూ ఇందులో 15 సం॥లు క్రితం గోడలుపై నిర్మించిన 770 చ.అ.లు లోని ఆర్.సి.సి. డాబా ఇల్లు.

ఇట్లు
గంగరాజు జగదీశ చంద్రబాబు,
న్యాయవాది, డోర్‌నెం. 5-50-24ఎ,
6/14, బ్రాడీపేట, గుంటూరు.

వైసిపి శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, దాడిలో గాయపడిన ఏసోబు (ఇన్‌సెట్)

దాడి దారుణం : బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక అంబేద్కర్ పార్క్ సెంటర్ వద్ద టిడిపి అధినేత చంద్రబాబును అవమానిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని, ఇది తట్టుకోలేక ఆ ఫ్లెక్సీని తొలగించేందుకు ప్రయత్నించిన టిడిపికి చెందిన దళిత నాయకుడు డేగల ఏసోబుపై వైసిపికి చెందిన వారు దాడి చేయడం అమానుషమైన చర్య అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. చంద్రబాబను అక్రమ కేసులలో ఇరికించి జైలుకి పంపించటమే కాక, ఆయనను కించపరుస్తు ఫ్లెక్సీలు వేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సదరు ఫ్లెక్సీలు చూసిన తెలుగుదేశం పార్టీ అభిమానులకు ఎవరికైనా బాధ కలుగుతుందని, దాన్ని వెంటనే తొలగించి వివాదాలు లేకుండా చూడాలని కోరారు. ఏసోబుపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక అంబేద్కర్ పార్క్ సెంటర్ ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు రాకపోకలకు ఈ గుంతల వలన తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీనిని గమనించిన శ్రీరామక్రిష్ణ సేవా సమితి కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి స్పందించి మంగళవారం సదరు గుంతలను పూడ్చి వేశారు.

నూతన సిఐకు సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణ నూతన సిఐగా ఇటీవలే వచ్చిన ప్రభాకర్‌ను ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో పి.హరీష్, సిహెచ్.కల్యాణ్, టి.వాసు, ఎం.సత్యనారాయణ, స్వామి ప్రసాద్, గోపి, డి.తేజ, వి.రాజేష్, సిహెచ్.వాసు, బి.గణేష్, టి.నరేష్, డి.కాశివిశ్వనాథం పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదార్లకు 'ఉపాధి' నిధుల జమలో అలసత్వం

- విధులు సరిగా నిర్వహించకుంటే తొలగిస్తాం : డ్వామా పీడీ
- ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉపాధి హామీ సిబ్బంది వద్ద వివరాలను అడుగుతున్న పీడీ యుగంధర్

ప్రజాశక్తి - నకరికల్లుజై

ఫీల్డ్ అసిస్టెంట్‌లు విధులు సక్రమంగా నిర్వహించకపోతే విధుల నుండి తొలగిస్తామని డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమాం హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం కింద చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. మండలంలో 1,85,000 పని దినాలకుగాను రూ.4.90 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుండి సమాచారం సేకరించారు. సాంకేతిక అనుమతులు లేకుండా గ్రామాల్లో పనులు నిర్వహించిన వారిపై అపరాధ రుసుం విధించారు. రిజిస్టర్లు రికార్డులు పరిశీలించారు. మండల పరిధిలో సుమారు 465 ఇళ్ల నిర్మాణం జరిగిందని, వాటికి 90 రోజుల ఉపాధి హామీ నిధులు రూ.కోటి పైచిలుకు నగదు జమ చేయడంలో సిబ్బంది విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాపిశెట్టిపాలెంలో 122 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఆధార్ అప్డేట్ కాక తొలగించిన విషయం తెలిసి రెండ్రోజుల్లోపు వాటిని పూర్తి చేయాలని కుంకలగుంట ఫీల్డ్ అసిస్టెంట్ కోటేశ్వరరావును ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బంది పనితీరు నచ్చకపోవడంతో నరసింగపాడు, తురకపాలెం ఫీల్డ్ అసిస్టెంట్లు మినహాయించి ఏపీవో రామకృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ సైదమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా నోటీసుకు సమాధానం చెప్పకపోతే అపరాధ రుసం విధిస్తామన్నారు. రూ.40360 రికవరీకి ఆదేశించారు. రూ.50670 ఏపీడీ రికవరీ కట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి టి.వెంకట విజయలక్ష్మి, ఎంపిడిఒ బి.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పి.అంజమ్మ, వెంకటేశ్వరరావు, టిఎలు గోపీకృష్ణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు

కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ 54వ పుట్టినరోజు వేడుకలు వైసిపి శ్రేణుల సమక్షంలో మంగళవారం ఘనంగా జరిగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నుండి స్టేషన్ రోడ్డు పాత చెక్ పోస్ట్ మార్గం మీదుగా భారీ ర్యాలీ నిర్వహించి జమిందారి ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. ఆయా మార్గంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గోపిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. తురుమెళ్లలో సర్పంచ్ కాటం శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కాటం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. మాజీ సర్పంచ్ గాజుల మాణిక్యం ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వడ్లమూడి వారిపాలెంలో సర్పంచ్ గానుగపంట ఉత్తమరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక వైసిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన వేడుకల్లో కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పి.ఓబుల్‌రెడ్డి, ఎంపిపి జి.వెంకట్రావు, వైసిపి మండల కన్వీనర్ పి.రవీంద్రబాబు, మార్కెట్ యార్డు ఛైర్మన్ బి.రామకృష్ణ, వైసిపి యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.శివారెడ్డి, నాయకులు ఎ.పున్నారెడ్డి, టి.అక్కయ్య పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

సమస్యలేమున్నా నా దృష్టికి తీసుకురండి

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రం రెంటచింతల, ఎర్రబాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడోరోజైన మంగళవారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమస్యలు ఏమన్నా ఉంటే తమ దృష్టికి తేవాలని, పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని అర్హులుంటే సంప్రదించాలని, అధికారులతో మాట్లాడి లబ్ధిచేకూరుస్తామని అన్నారు. ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మరోసారి ఇదే ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి చౌడేశ్వరి, ఎంపిడిఒ మహాలక్ష్మి, తహశీల్దార్ పుల్లారావు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - రెంటచింతల

ఈనెల 18వ తేదీన వినాయక చవితి పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపారు. విగ్రహాలను ఏర్పాటు చేసేవారు రోడ్లపై పాదాచార్లకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చలానాలు తీయడంతో పాటు మైకు పర్మిషన్ కూడా తీసుకోవాలన్నారు. ఏ రోజున? ఎక్కడ నిమజ్జనం చేస్తున్నారో తెలపాలని, మండపాలకు విద్యుత్ సరఫరా కోసమూ అనుమతి తీసుకోవాలని చెప్పారు. నిమజ్జనం చేసే వరకూ విగ్రహాల వద్ద ప్రతిరోజూ రాత్రి ఇద్దరు చొప్పున కాపలా ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రచారంలో నాయకులు

నాలుగేళ్లయినా బాధితులకు దక్కని న్యాయం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని ప్రకటించిన జగన్‌మోహన్‌రెడ్డి రూ.906 కోట్లు విడుదల చేసి మిగతా సొమ్ము 3 నెలల్లో చెల్లిస్తామని చెప్పారని, ఇప్పటికి నాలుగేళ్లయినా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయలేదని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మధుసూదనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 న తలపెట్టిన చలో విజయవాడ శంఖారావదీక్షలో కస్టమర్లు ఏజంట్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నరసరావుపేట పట్టణంలో కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. కె.రాంబాబు, వి.వెంకట్, యు.రంగయ్య పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపినందుకు కేసులు : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చంద్రబాబుకు సంఘీభావం తెలిపిన ఘటన తనతోపాటు టిడిపికి చెందిన 80 మందిపై పోలీసులు 3 రకాల కేసులు నమోదు చేశారని, చంద్రబాబుకు మద్దతు తెలపడం కూడా తప్పేనా? అని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబును నంద్యాల నుండి విజయవాడకు తరలిస్తుండగా ఆయనకు సంఘీభావం తెలపడానికి టిడిపి శ్రేణులు పట్టణంలోని ఎన్‌ఆర్‌టి సెంటర్‌కు భారీగా తరలివచ్చారని, అయితే కాన్వాయ్‌ను అడ్డుకున్నామని, విధులకు తీవ్ర ఆటంకం కలిగించామని, జాతీయ రహదారిపై గుమ్మిగూడి రాకపోకలకు అంతరాయం కల్పించామనే ఫిర్యాదుతో టిడిపికి చెందిన 9 మందిపైనా కేసులు నమోదు చేశారని వివరించారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని, పోలీసులను పావులుగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన విధంగా బుద్ధి చెబుతారని పుల్లారావు హెచ్చరించారు. పోలీసులు తమపై కేసులు పెట్టారని చెప్పారు. పోలీస్ వాహనంపై పెట్రోలు పోసి తగులబెట్టపోయారని, ఇదంతా పుల్లారావు ఆదేశాల మేరకే చేశారంటూ ఎస్ఐ పి.మాచర్ల ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. ఎస్ఐ బాలకృష్ణ ఫిర్యాదు మేరకు 57 మందిపైన, నాదెండ్ల మండలం గిరిజవోలుకు చెందిన బి.జవహర్‌బాబు ఫిర్యాదుతో

సమస్యలు పరిష్కరించకుంటే 26 నుండి మరో ఆకలిపోరు

ఫిరగిపురంలో కార్మికుల విస్తృత సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నెలల పర్యంతం జీతాలు ఇవ్వకుంటే కార్మికుల జీవితాలు గడిచేది ఎట్లా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ ప్రశ్నించారు. 25వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకుంటే 26 నుండి మరో ఆకలిపోరుకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపిచ్చారు. మంగళవారం ఫిరంగిపురంలో నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. పంచాయతీలో పనిచేస్తున్న టెండర్ కార్మికులు, గ్రీన్ అంబాసీడర్లకు సంబంధించిన 9నెలల బకాయి జీతాలు చెల్లించాలని గత మార్చి నెలలో ఆకలి పోరు పేరుతో ఫిరంగిపురం మండల కేంద్రంలో పెద్ద పోరాటం నిర్వహించారని ఆ సందర్భంగా ఫిరంగిపురం గ్రామపంచాయతీ కార్మికులకు గత జనవరి వరకు ఉన్న బకాయి జీతాలు చెల్లించారన్నారు. మళ్లీ ఆ రోజు నుండి ఈరోజు వరకు జీతాల చెల్లింపు జరగలేదని అన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు ఇచ్చే జీతం రూ.6000 అయినా అది కూడా 11 నెలల పాటు బకాయి ఉండడంతో కార్మికులు అప్పుల బాధతో పనిచేయలేక రెండు నెలల క్రితం పని మానుకున్నారని అన్నారు. ఆ పనిని కూడా అదనంగా టెండర్ కార్మికులే చేస్తున్నప్పటికీ అధికారులు వీరి జీతాలు చెల్లింపు విషయంలో ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదని ఇది అత్యంత శోచనీయమని అన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించి, జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు ఉన్నా గ్రామ పంచాయతీ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదని అన్నారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి మస్తాన్ వలి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు గత ఐదేళ్ల గా జీతాలు పెంపుదల చేయలేదని నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో వారి జీతాలు పెంచకపోతే ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనెలు లాంటి చిన్నచిన్న సౌకర్యాలు కూడా అధికారులు కార్మికులకు సమకూర్చకపోవడం కేవలం నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదని అన్నారు. జనరల్ బాడీ సమావేశం అనంతరం కార్మికులు ఫిరంగిపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 25వ తేదీలోగా సమస్యలు పరిష్కారం చేయనట్లయితే 26వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు పూనుకుంటామని ఆ నోటీసులో కార్మికులు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు రామారావు, ఇబ్రహీం, గ్రామ నాయకులు శ్రావణ్ కుమార్, ప్రభుదాసు పాల్గొన్నారు.

ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వై నేతాజీ , కార్మికులు

వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

రూ.5.13 కోట్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ముస్తఫా, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలిసి సంగడిగుంట, ఏటుకూరు రోడ్డు, కబాడీ గూడెంలలో రూ.3.53 కోట్ల అంచనా వ్యవయంతో సిసి రోడ్రైన్లు, అలాగే రూ.1.60 కోట్ల ంచనాతో పొన్నూరు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ వైసిపి పాలక వర్గం వచ్చాక నగరంలో అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గుంటూరు నగరాన్ని మోడల్ నగరంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మేయర్ మాట్లాడుతూ వైసిపి పాలక వర్గం ఏర్పడ్డాక నగరంలో సుమారు రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రధాన రోడ్ల విస్తరణ పనులలో జిఎంసి చేపట్టిన పనులు పూర్తి అయ్యాయన్నారు. కమిషనర్ మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, డ్రైన్ల ఏర్పాటుకు ప్రజాప్రతినిధుల ద్వారా గుర్తించిన ప్రాంతాల్లో అధిక ప్రాధాన్యతతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్.సజీలా, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపి అయోధ్యరామిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

కెఎల్‌యులో అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని పూర్వవిద్యార్థుల విభాగం అవార్డులు -2023 కార్యక్రమాన్ని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, అమెరికాలోని కెఎల్ యు పూర్వ విద్యార్థుల విభాగ అధ్యక్షులు కిరణ్ పల్లా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన కెఎల్‌యు పూర్వవిద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విభిన్న రంగాల్లో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న పూర్వవిద్యార్థులకు అవార్డులను అందజేసి వారిని ఘనంగా సత్కరించినట్లు పూర్వవిద్యార్థుల సంబంధాల విభాగ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శ్రీకావ్య తెలిపారు. అనేక సంవత్సరాల తరువాత ఒకే వేదిక పైన కలుసుకోవడంతోపాటు పూర్వ విద్యార్థులను సత్కరించుకోవడం తమకు ఎంతగానో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అంతర్జాతీయ సంభందాల విబాగ డైరెక్టర్, ఎం.హెచ్ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, ఆర్.అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ తదితరులు

కుటుంబ నియంత్రణ అధికారిగా రామారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లోని కుటుంబ నియంత్రణ విభాగం ఇంచార్జీగా డాక్టర్ పి రామారావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కు.ని విభాగంను తనిఖీ చేసిన సమయంలో అనేక సమస్యలను గుర్తించామని చెప్పారు. ఈ విభాగనికి ఇంచార్జి లేకపోవడం తో డి యం ఈ కి తెలియ చేసామని, అందులో భాగంగా డాక్టర్ రామారావు ను ఇంచార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారని చెప్పారు. ట్యూబెక్టమి, కుట్టు కోత లేకుండా ఆపరేషన్‌లు చేయాలనీ ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గురు ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు త్వరితగతిన పూర్తి చేయాలి

సమగ్ర శిక్ష అడిషనల్ కో-అర్డినేటర్ ఎం విజయలక్ష్మి

ప్రజాశక్తి -తెనాలి

ఫేజ్2 అదనపు తరగతి గదులను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్షఅడిషనల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మీ చెప్పారు. మంగళవారం తెనాలి మున్సిపల్ కౌన్సిల్ హాలులో నాడు నేడు ఫేజ్ 2 ప్రధానోపాధ్యా యుల సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో విజయలక్ష్మి పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుద్దేశించి మాట్లా డుతూ కొన్ని పాఠశాలల్లో పెద్ద మొత్తంలో ఉన్న నగదుని 10 కాంపోనెంట్స్ పనులు జరుగుతున్న వేరొక పాఠశాలకు (టి యి ఓ) అప్లోడ్ చేసి ట్రాన్సఫర్ చేయడం జరుగు తుందని, సాంకేతిక సమస్యలు ఉన్న ప్రధానోపాధ్యాయులు డిస్ట్రిక్ట్ ఎంఐఎస్ జాలాది రవి ని సంప్రదించాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు వెబెక్స్ ద్వారా చేస్తున్న సూచనలను అనుసరిస్తూ నాడు నేడు పనులు పూర్తిచేయాలన్నారు. ప్రధానోపాధ్యా యులు, ఇంజినీరింగ్ అధికారులు సచివాలయం ఎమినిటీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో తెనాలి, కొల్లిపర మండల విద్యాధికారులు వరుసగా ఎం.లక్ష్మీనారాయణ, వి. జయంతి బాబు, జి సాల్మన్ రాజు, కె.ఝాన్సీ లత, మున్సిపల్ డిఈ నాగభూషణం, ఎఈ లు రాజా ఫణీంద్ర, ఆంజనేయరాజు, చైతన్య పాల్గొన్నారు.

జెకెసి కాలేజి రోడ్డులో ప్రమాదాలు నివారించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని సిపియం నగర కమిటీ సభ్యులు షేక్.ఖాశింవలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ముఖ్యంగా మహాలక్ష్మి బార్ నుండి ఆర్టీఒ ఆఫీసు వరకూ సెంటర్ డివైడర్ లేకపోవటం వల్ల, వాహనాలు వేగంగా నడపటం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. కార్లు, టూవీలర్లతోపాటు, టిప్పర్లు, లారీలు, బస్సులు వంటి భారీ వాహనలు కూడా పెద్ద సంఖ్యలో ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నాయన్నారు. పల్నాడు నుండి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా అమరావతి, విజయవాడ వెళ్లే వారికి ఈ రోడ్డు ప్రధాన రహ దారిగా ఉందన్నారు. వాహనాల రద్దీ పెరగటంతో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నా రన్నారు. వారంలో కనీసం రెండు, మూడు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, సెంటర్ డివైడర్ ఏర్పాటు చేయాలని, అలాగే మూడో ఫేజ్ ఇన్నర్ రింగు రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. తద్వారా పేరేచర్లకు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా ఇన్నర్ రింగు రోడ్డులో ప్రయాణిస్తాయన్నారు.

పొక్లెయినర్‌తో మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న కార్మికులు

పారిశుధ్య సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని బేతపూడి జడ్‌పిహైస్కూల్ వెనుక మురుగు కాల్వలో చెత్త, వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు వేయడంతో నీరు పారుదల లేక మురుగు వాసన వస్తుంది. పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి బేతపూడి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించారు. మంగళవారం క్రేన్‌ల ద్వారా మురుగు కాల్వను శుభ్రం చేయించారు. దీంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికారులకు ధన్యవదాలు తెలిపారు.

ప్రతి విద్యార్థి పుట్టినరోజు నాడు మొక్క నాటాలి

ఇంటర్ విద్యాశాఖ రీజనల్ అధికారి జికె జుబేర్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ప్రతి ఒక్క విద్యార్థి తన జన్మదినం రోజున తప్పక ఒక మొక్క నాటాలని తద్వారా పర్యావరణం పట్ల ప్రేమను పెంచుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ రీజనల్ ఇనస్పెక్షన్ ఆఫీసర్ జీకే జుబేర్ కోరారు. అఫీషియల్ విజిట్‌లో భాగంగా పొన్నూరు మండల పరిధిలోని వెల్లూరు గ్రామ జూనియర్ మహిళా కళాశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిజిటి ఉపాధ్యాయుల డైరీలను, టీచర్ నోట్స్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల ప్రత్యేకతలను, సదుపాయాలను గురించి తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు పునాది ఇక్కడ నుండే ప్రారంభమవుతుందని, కావున విద్యార్థులు ఇంటర్మీడియట్ సమయంలో శ్రద్ధతో చదవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే రమేష్, అధ్యాపకులు ఎం ఎం ఖుద్దుస్, వి . రమేష్, కే బాబురావు , సృజన, నాగ పార్వతి, షహనాజ్, శ్రీనివాసరావు, టి అరుణ్ కుమార్, డి శాంతి రాజు పాల్గొన్నారు.

లోను కోసం వెళ్తే అత్యాచారయత్నం

- రాజీ చేసుకోవాలంటూ సిఐ ఒత్తిడి చేస్తున్నారు
- ఫైనాన్స్ సంస్థ యజమానిపై ఎఎస్‌పికి యువతి ఫిర్యాదు

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

లోను పేరుతో తనను లోబర్చుకోవాలని చూసిన చరిష్మ ఫైనాన్స్ యజమాని నరేంద్రపై కఠిన చర్యలు తీసుకోవాలని, మరే మహిళకూ ఇటువంటి పరిస్థితి రాకూడదని పట్టణంలోని సాయి నగర్‌కు చెందిన పావులూరి నాగలక్ష్మి ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ రాఘవేంద్రకు ఆమె మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యువతి మాట్లాడుతూ ఈ నెల 4న నరేంద్రను తాను లోనుకోసం సంప్రదించానని, సంబంధిత పత్రాలు తీసుకొని ఎన్జీవో కాలనీలోని కార్యాలయానికి రావాలని ఆయన చెప్పగా వెళ్లానని తెలిపారు. అయితే అది కార్యాలయం కాకుండా నివాసంలా ఉండటంతో భయపడుతూనే లోపలికి వెళ్లానని, వెళ్లగానే ఆయన తన చేతిని పట్టుకోవడంతో తాను ప్రతిఘటించి బయటికి వచ్చానని, పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వెంటనే ఆయన్ను అదుపులోకి తీసుకున్నారని వివరించారు. అయితే నరేంద్రపై కేసు నమోదు చేయకుండానే విడిచిపెట్టారని, రాజీకి రావాలంటూ టూటౌన్‌సిఐ వీరేంద్ర ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై టూటౌన్ సిఐను వివరణ కోరగా రాజీ ఒత్తిడి ఆరోపణ నిజం కాదన్నారు. ఘటనపై విచారణ చేస్తున్నామని, బాధితురాలికి న్యాయం చేస్తామని చెప్పారు.

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న బాధిత యువతి

చంద్రబాబు అరెస్టుపై మహిళల నిరసన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జిఓ కాలనీకిలో మాజీ కౌన్సిలర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమన్నారు. పోలీసులను, న్యాయ వ్యవస్థను సైతం వైసిపి ప్రభుత్వం తమ కనుసన్నల్లో నడిపిస్తోందని విమర్శించారు.

రాష్ట్రజట్టుకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సెక్రటరీ కొమ్మాలపాటి శ్రీకాంత్, తదితరులు

జంప్‌రోప్‌లో రాష్ట్ర జట్టుకు విజయ విద్యావిహార్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని విజయ విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు జంప్ రోప్‌లో సత్తా చాటారు. తెనాలిలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి జంప్‌రోప్ పోటీల్లో విద్యావిహార్ పాఠశాలకు చెందిన వేమా తేజస్విని, గట్టమనేని మల్లేశ్వరి, బిట్రగుంట బ్రహ్మశ్రీజ, దేవాసి కవిత, షేక్ నూర్ అబ్బాస్ వరుసగా బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. వీరంతా త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారని పాఠశాల సెక్రటరీ కొమ్మాలపాటి శ్రీకాంత్, హెచ్‌ఎం ఎన్.కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులతోపాటు పిఇటి వాసంతిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కె.రాధ, ఉపాధ్యాయులు శ్రీదేవి, రజని, లక్ష్మి అనిత, వాసు, పవన్, రామాంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహారం అందిస్తున్న సర్పంచ్ రాంబాబు

మరణాలను తగ్గించేందుకు పోషకాహారం

ప్రజాశక్తి - అమరావతి

మాతాశిశు మరణాలను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తున్నట్లు మండలంలోని ఎంద్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు అన్నారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రతినెలా పోషక విలువలతో కూడిన ఆహార వస్తువులను ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడి సూపర్వైజర్ షేక్ పెదఇమాంబి మాట్లాడుతూ పరిశుభ్రత, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ చర్యలు, ఇమ్యునైజేషన్, పోషణ పట్ల అందరూ శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు అనిత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో వైద్యులు, సిబ్బంది

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రజల వద్దకే వైద్యం

ప్రజాశక్తి - కారంపూడి

ప్రజల వద్దకే వైద్యం అనే నినాదంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బత్తుల దుర్గారావు అన్నారు. మండల కేంద్రమైన కారంపూడిలోని సచివాలయం-2 వద్ద మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది పిల్లలు, మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ ఇంకా అనేక ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామని వైద్యులు చెప్పారు. ప్రతినెలలో రెండుసార్లు ఈ శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు ఈశ్వరి, అనూష, ఎంసిహెచ్‌పి టి.పవిత్ర, 104 సిబ్బంది బి.శ్రావణి, ఎం.శివసుధాకర్‌రెడ్డి, అంగన్వాడి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో యడ్లపాడు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని ఎస్సీ కాలనీకి చెందిన కోడిరెక్క ధనలక్ష్మి షూటింగ్‌బాల్‌లో ప్రతిభ చూపారు. బుడంపాడులోని సెయింట్ మేరిస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ధనలక్ష్మి గతనెల బాపట్ల జిల్లా మార్టూరులో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చూపడంతోపాటు ఈనెల 8, 9, 10 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్ మీట్ విభాగంలోనూ ప్రతిభ చూపి జట్టు తృతీయ స్థానంలో నిలవడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు.

బహుమతి సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

క్విజ్‌లో త్యాళ్లూరు జెడ్‌పి విద్యార్థులకు ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. 'హిందీ దివస్'ను పురస్కరించుకుని పల్నాడు జిల్లా స్థాయిలో శంకరభారతిపురం హైస్కూల్లో మంగళవారం హిందీ క్విజ్ పోటీలు జరిగాయి. బహుమతి సాధించిన విద్యార్థులతోపాటు వారికి శిక్షణిచ్చిన ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, టి.మాధవిని ఎంఇఒలు వై.ప్రసాద్‌రావు, టి.సత్యనారాయణ, హెచ్‌ఎం డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి, పిసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

డ్రిప్ ఇరిగేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - రెంటచింతల

డ్రిప్ ఇరిగేషన్ పథకానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ మహాలక్ష్మి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదెకరాల్లోపున్న రైతులు 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాలు పైన పొలం ఉన్నవారికి 45 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, వన్ బి అడంగల్, ఫీల్డ్ మ్యాపు, బ్యాంక్ ఖాతా పుస్తకాన్ని దరఖాస్తుతోపాటు జత చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ నరేంద్రరెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి ఎన్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఎదుట ప్రత్యక్షమైన మహిళ

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని మల్లవరానికి చెందిన వడితే కుమారి భర్త మంత్రు నాయక్‌తో విభేదాల కారణంగా నెలరోజుల క్రితం ఇల్లు వదిలిపోయారు. అయితే ఆమె మంగళవారం రెంటచింతల పోలీసులు ఎదుట ప్రత్యక్షమయ్యారు. కుమారి అదృశ్యంపై ఇప్పటికే కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపారు.

15న మండల పరిషత్ సర్వసభ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15న శుక్రవారం నిర్వహిస్తామని ఎంపిడిఒ ఉమాదేవి మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో నిర్వహించే సమావేశానికి ఎంపిపి అధ్యక్షత వహిస్తారని, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

జీతాల కోసం నిరీక్షణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నెలలో రెండో వారం ముగింపు దశకు వచ్చినా ఉపాధ్యాయులకు జీతాలు, విశ్రాంత ఉపాధ్యాయులకు పెన్షన్లు జమ కాలేదు. ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం మాత్రం ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాల జమలో తీవ్ర జాప్యం చేస్తోంది. దీనిపై ఉపాధ్యాయులు, సంఘాల్లో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జీతాలు, పెన్షన్లే ఆధారంగా జీవించే తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. దీనిపై రాష్ట్రస్థాయి అధికారులకు పలుమార్లు ప్రాతినిధ్యం చేసినా స్పందన కరువైందని వివిధ సంఘాల నాయకులు చెబుతున్నారు. పిల్లల చదువులు, ఫీజులు, కుటుంబ ఖర్చులకు ఇబ్బంది పడుతున్నామని, వివిధ అవసరాల కోసం బ్యాంకు రుణాలు, ఇఎంఐలు చెల్లించడానికీ డబ్బుల్లేక అపరాధ రుసుంను భరించాల్సి వస్తోందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

ఓటరు పరిశీలనను నిరంతరం పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటింటికీ ఓటరు కార్డులను బిఎల్ఒలు వెరిఫికేషన్ చేస్తున్న విధానంపై నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి తొలగించబడిన ఓటర్ల జాబితా, ఇంటింటి సర్వే, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మాట్లాడుతూ నూతన ఓటర్లకు సంబంధించి ఫారం 6, 7, 8లకు సంబంధించి క్లైమ్స్ వెరిఫికేషన్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఓటరు కార్డు వెరిఫికేషన్‌కు వెళ్లినప్పుడు బీఎల్వోలు ఆ ఇంటిలోని కుటుంబ సభ్యుల ఓటరు కార్డులకు సంబంధించి అన్ని విషయాలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి వివరాలు నమోదు చేసేలా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎస్.ఎస్.ఆర్-2024 కు సంబంధించి అన్ని కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం.వెంకట శివరామి రెడ్డి, లలితా, జిఎంసి అదనపు కమిషనర్ పెద్ది రోజా , ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఏఈఆర్వోలైన తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

పోలింగ్ కేంద్రాల మార్పుపై కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి అభిప్రాయాలను తెలియచేయాలని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్, పోలింగ్ కేంద్రాల మార్పుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశములను అనుసరించి నగరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిఎంసి అధికారులు కొన్ని కేంద్రాల చిరునామా, మరి కొన్ని కేంద్రాల పేర్లు మార్పుకు ప్రతిపాదించారని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్‌లను పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే అభ్యంతరాలను తెలియచేయాలని కోరారు. కొన్ని కేంద్రాలు నాడు-నేడు పనుల వలన, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కొనసాగక పోవడం వలన కేంద్రాలను పూర్తిగా మార్పు చేస్తున్నామని, మరి కొన్ని కేంద్రాల పేర్లు సరిచేశామని తెలిపారు. తూర్పులో 96, పశ్చిమలో 49 పోలింగ్ కేంద్రాల లోకేషన్స్ మార్చడానికి, తూర్పులో 52, పశ్చిమలో 38 కేంద్రాల పేర్లు మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రెండ్రోజుల్లో కేంద్రాలపై అభ్యంతరాలు తెలియచేసిన అనంతరం నివేదిక జిల్లా ఎన్నికల అధికారికి పంపుతామన్నారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఏఈఆర్వోలు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, కోటయ్య, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, రాజకీయ పార్టీల నుండి బహుజన్ సమాజ్ పార్టీ సిహెచ్.వాసు, సిపిఎం ఖాసిం షహీద్, తెలుగుదేశం పార్టీ ఎన్.ఓంకార్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

యుసిసి ప్రయత్నాన్ని కేంద్రం మానుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి మానవత్వ విలువలకు తిలోదకాలు ఇస్తూ యుసిసి తీసుకురావాలని చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఫాస్టర్లు తెలిపారు. మంగళవారం మంగళగిరి పార్కు రోడ్డులోని ఇమ్మానుయేలు చర్చిలో మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ బొంతపురి జెరోం రవి ప్రకాష్ అధ్యక్షతన ప్రత్యేక పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ సంఘటనలు దేశ సంస్కృతిని మంటలో కలిపాయన్నారు. తెగలు, కులాల కురుక్షేత్రంగా మతాల మారణ హోమంగా చివరకు, స్త్రీలను గౌరవించే దేశంలో వారిని, నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ చేసే పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను శిక్షించాలని , బాధితులకు న్యాయం చేయాలని, దుండుగులు ధ్వంసం చేసిన చర్చిలను ఇళ్లను పునర్నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. గుంటూరులో పాస్టర్లు కొరిటిపాటి నెహెమ్యా, మద్దు జాన్సన్ పై మత విద్వేషకుల దాడిని తీవ్రంగా ఖండించారు. దోషులను త్వరగా పట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను దష్టిలో పెట్టుకొని , సెప్టెంబర్ నెల 15 వ తేదీ, ఉదయం 9 గంలకు గుంటూరు కలెక్టరేట్ ఎదురు జరిగే సామూహిక ప్రార్ధనలకు అన్ని చర్చిల నుండి పాస్టర్లు , క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పిల్లి దయారత్న కుమార్, దున్నా నాగయ్య , బేతాల సాల్మన్ రాజు , నండూరి బాలస్వామి , కవల అబ్రహాం , కళ్ళం వినయ్ కుమార్ , మాతంగి భాస్కర రావు , గోనె లూథర్ తదితరులు పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి : డిఎస్‌పి

ప్రజాశక్తి- తెనాలి

ఈనెల 18న వినాయక చవితి పర్వ దినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసే చవితి మండపాలకు అధికారుల అనుమతులు కచ్చితంగా తీసుకోవాలని డీఎస్పీ బి జనార్ధన రావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాలను ఏర్పాటు చేయదలచిన వారు ఒక గ్రూపుగా ఏర్పడాలన్నారు. మండపం ఏర్పాటు చేసే స్థలం పంచాయతీ, మున్సిపాలిటీలకు చెందినదైతే అధికారుల అనుమతులు, ఏదైనా ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించినదైతే వారి అనుమతి కచ్చితంగా తీసుకోవాలన్నారు. అలాగే వాహనాలకు, పాదచారుకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద కమిటీ తరపున ఒక ప్రతినిధి పర్యవేక్షణ ఉండాలన్నారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత పోలీసులు, ఎలక్ట్రికల్, ఫైర్ శాఖల అనుమతులు విధిగా ఉండాలన్నారు. ఉత్సవం ఎన్ని రోజులు నిర్వహిస్తారు, ఏ రోజు నిమజ్జనం చేస్తారు, నిమజ్జనానికి తీసుకువెళ్లే మార్గం అన్నీ కూడా పోలీస్ శాఖకు సమాచారం ముందుగానే ఇవ్వాలన్నారు. తద్వారా ఆయా మార్గాలలో ఇబ్బంది లేకుండా పోలీసులు జాగ్రత్త తీసుకుంటారన్నారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ సిస్టం సౌండ్ పరిమితికి లోబడి మాత్రమే ఉండాలని, అనుమతులలో పొందుపరచిన సమయాలకు మించి సౌండ్ సిస్టం ఉపయోగించరాదన్నారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో త్రీ టౌన్ సిఐ రమేష్ బాబు, టూ టౌన్ సిఐ వెంకటేష్ పాల్గొన్నారు.

దుగ్గిరాల చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కిషోర్‌కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి

దుగ్గిరాల చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కొండూరు గ్రామానికి చెందిన కొండూరు కిషోర్ కుమార్‌ని నియమించారు. మంగళవారం మంగళగిరిలోని ఎపి చర్మకార సంక్షేమ సంఘం కార్యాలయంలో కొండూరు కిషోర్ కుమార్ ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు

బుల్లా నియామక పత్రాన్ని కిషోర్ కుమార్‌కు అందజేశారు.

అనంతరం రాజారావు మాట్లాడుతూ మండలంలో చర్మకార్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా పని చేయాలన్నారు. చర్మకారులకు ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలు, పథకాలపై అవగాహన పరిచే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ, చర్మకారుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కిషోర్ కుమార్ మాట్లాడుతు ప్రభుత్వ పథకాలను చర్మకారుల దగ్గరకు చేర్చేలా కృషి చేస్తానన్నారు. వారి సమస్యలపై నిరంతరం పని చేస్తానని, తనను ఎంపిక చేసిన బుల్లా రాజారావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

కుంచనపల్లి లోని విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి, కొలనుకొండ, గుండిమెడ గ్రామాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళగిరి డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అధికారులకు ప్రజల సహకరించాలని ఆయన కోరారు.

నేడు కాకుమానులో 'జగనన్నకు చెబుదాం'

హాజరుకానున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - కాకుమాను

కాకుమానులో బుధవారం నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి హాజరవుతారని తహశీల్దార్ ప్రసాద్ రావు తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతు వారానికి రెండు మండలాలు సందర్శించల్సి ఉందని తెలిపారు. దానిలో భాగంగా నేడు కాకుమానులో జగన్ అన్నకు చెబుతాము కార్యక్రమం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో మండల అధికారులు , తదితరులు పాల్గొన్నారు

బాబు చేసిన తప్పుల వల్లే జైలు పాలు

ప్రజాశక్తి - తాడికొండ

మాట్లాడుతున్న కత్తెర సురేష్

చంద్రబాబు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేసిన తప్పులు వల్లే జైలు జీవితం గడుపుతున్నారని చెప్పారు. సరైన సాక్షాధారాలతో సిఐడి అరెస్టు చేసి కోర్టు ముందు ఉంచిందన్నారు. రకరకాల ప్రయోగాలతో తప్పించుకోవాలని చేసిన చంద్రబాబు ప్రయత్నాలు విఫలం అయ్యాయని హౌస్ రిమాండ్ విధించాలని చేస్తున్న ప్రయత్నాలు కూడా విఫలం అయ్యాయన్నారు. అంటే చంద్రబాబు నాయుడు ఏ విధంగా తప్పులు చేశారో అర్థమవుతుందన్నారు. పలు కేసుల్లో స్టేలు తెచ్చుకుని ఎవరు నన్నేమీ చేయలేరని ఊహాజనీతమై ఉన్నారని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టే మాటలు చెబుతూ రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్న చంద్రబాబు జైలులో విశ్రాంతి తీసుకుంటే మంచిదని హితవు పలికారు. బాబుతో పాటు చిన్న బాబు కూడా జైలు జీవితం గడిపే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

అరెస్టులు, గృహ నిర్బంధాలకు భయపడం

మేయర్‌పై కేసు నమోదుకు జనసేన వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మేయర్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని జనసేననాయకులు మంగళవారం ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసరావు,నగర అధ్యక్షులు నేరేళ్ల సురేష్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ మేయర్ అహంకారంతో పవన్ కల్యాణ్‌ను దూషించారని అన్నారు. తన పదవిని కాపాడుకునేందుకు వైసిపిపెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. తానొక మేయర్ అనే విషయాన్నీ కూడా మర్చిపోయి మాట్లాడటం శోచనీయం అన్నారు. తన వెంట తెచ్చుకున్న రౌడీ మూకలతోకలిసి జనసేన మహిళలపై దాడికి పాల్పడ్డారని అన్నారు. సోమవారం రాత్రి నుంచి గృహనిర్బంధాలు చేయడం, తమపార్టీ నాయకులను నియంత్రించడం సరికాదన్నారు. గృహనిర్బంధంలోఉన్నవారిని విడిచిపెట్టాలని వారు ఎస్పిని కోరారు. మేయర్ క్షమాపణ చెప్పే వరకు అతనిని వదిలిపెట్టమన్నారు.

25న తపాలా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు

తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాల కోసం కమీషన్ ప్రాతిపదికన ఏజెంట్లుగా పనిచేయటానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తపాలా శాఖ గుంటూరు డివిజన్ సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గుంటూరు నగరంలోని చంద్రమౌళీ నగర్‌లోని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసులో ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోటేడా, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. నియమించబడిన అభ్యర్థులు రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా 5 ఏళ్ల నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్స్ రూపంలో పూచీకత్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రూ.5వేలు కూడా ఏజెన్సీ రద్దు చేసుకున్న సమయంలో జాతీయ పొదుపు పథకం వడ్డీరేటుతో సహా తిరిగి చెల్లించటం జరుగుతుందన్నారు. వివరాలకు 0863-2255978, 0863-2255078 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలకార్మికులతో మాట్లాడుతున్న ఎస్‌పి సరిత

9 మంది బాలకార్మికులకు విముక్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో దుకాణాల్లో పనిచేస్తున్న 9 మంది బాల కార్మికులను పోలీస్, కార్మిక శాఖ, మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారులు మంగళవారం గుర్తించి విముక్తి కల్గించారు. ఆపరేషన్ స్వేచ్ఛ - 3 లో భాగంగా బచ్పన్ బచావో ఆందోళన క్రాప్ ఆర్గనైజేషన్ లు కలిసి గుంటూరు లో మెకానిక్ షాప్స్,వాటర్ ప్లాంట్స్, చికెన్ సెంటర్ లో బాల కార్మికుల డ్రైవ్ నిర్వహించగా పని చేస్తున్న 9 మంది బాల కార్మికులను గుర్తించి వారిని రిస్క్యూ జిల్లా బాలకార్మిక విభాగం ఎదుట హాజరు పరిచారు. వీరి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలో చేర్పించాలని సూచించినట్లు సిఐడి మహిళా రక్షణ విభాగం ఎస్‌పి కె.జి.వి.సరిత తెలిపారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగర కమిషనర్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం-స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించి, పుర స్కారం అందుకున్న సందర్భ ంగా జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి నగర కమిషనర్ కీర్తి చేకూరిని అభినందించారు. మంగళవారం కమిషనర్ జిల్లా కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే

కమిషనర్‌ను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలతో నగరానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిఎంసి ఎస్.ఈ భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సాంబశివరావుకు సేవానంది అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

గత 15 సంవత్స రాలుగా లాల్‌పురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ విజ్ఞానంతో వినోదం కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విద్యా ర్థుల్ని తీర్చిదిద్దుతున్న చివుకుల సాంబశివరావు

సాంబశివరావును అభినందిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నాయకులు

ఇటీవల ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి సేవానంది నేషనల్ అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ మంగళవారం తన కార్యాలయంలో అభినందిం చారు. ఈ సందర్భంగా సాంబశివ రావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ 1.50 లక్షల మంది విద్యార్థులకు సైన్స్, మ్యాథమెటిక్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, పాల్గొన్నారు.

లలితా హాస్పిటల్‌కు డైమండ్ అవార్డు

కాన్ఫరెన్స్‌లో అవార్డు అందుకున్న డాక్టర్ విజయ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లాలో ప్రైమరీ స్ట్రోక్ సెంటర్లను అభివృద్ధి చేస్తే పక్షవాత రోగులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ అన్నారు. న్యూఢిల్లీలో ఈనెల 7, 8 తేదీల్లో జరిగిన గ్లోబల్ స్ట్రోక్ అలయన్స్ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుండి డాక్టర్ విజయ పాల్గొన్నారు. డబ్ల్యూఎస్ఒ ప్రెసిడెంట్ డాక్టర్ షీలా మార్టిన్స్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జయరాజ్ పాండియన్ నాయకత్వంలో ఈ సదస్సు జరిగింది. సర్టిఫైడ్ స్ట్రోక్ సెంటర్ల ఏర్పాటు గురించి జరిగిన ఈ సమావేశంలో ప్యానలిస్టుగా వ్యవహరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పక్షవాత రోగులకు అందిస్తున్న అధునాతన చికిత్సలకుగాను లలిత హాస్పిటల్‌కు మరోసారి డైమండ్ అవార్డు దక్కింది. డాక్టర్ విజయ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో 91 శాతం స్ట్రోక్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, మన దేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 18 శాతం మాత్రమే స్ట్రోక్ యూనిట్లు ఉన్నాయని డాక్టర్ విజయ అన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజితోపాటు, డిస్ట్రిక్ హాస్పిటల్స్‌లో కూడా సిటి స్కాన్ అందుబాటులో ఉందన్నారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో ప్రైమరీ స్ట్రోక్ సెంటర్లను అనుసంధా నం చేసి, అభివృద్ధి చేయాలన్నారు. ప్రపంచ వ్యాపంగా స్ట్రోక్ కేర్‌ను పెంపొందించ టానికి కట్టుబడి ఉన్న శక్తివంతమైన ప్రపంచ కూటమిని స్థాపించటమే ఈ సదస్సు ప్రాథమిక లక్ష్యమని ఆమె అన్నారు.

మేయర్ కావటిపై నేడు సుప్రీంలో కేసు వేస్తాం

ఇసుక ర్యాంపుల్లో అక్రమాలపై ఈడీ విచారించాలి

జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

తమపార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి అశాంతి రేపిన గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడుపై పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేయాలని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. ద్వేషపూరితమైన ప్రసంగాలు, వ్యాఖలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని చట్టంలో స్పష్టంగా ఉందన్నారు. మేరకు సుప్రీం కోర్టు ఆదేశాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేయకపోతే బుధవారం తాము సుప్రీంకోర్టులో కేసుదాఖలుచేస్తామన్నారు. గుంటూరు పోలీసులు సుప్రీం కోర్టు ఆదేశాల ఉల్లంఘన కేసు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారిపై సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవచ్చని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయని ఇందుకు ఎవ్వరూఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదన్నారు. గుంటూరు మేయర్ గా ఉన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలు కచ్చితంగా ద్వేషపూరితమైన ప్రసంగంలోకే వస్తుందన్నారు. రూల్ ఆఫ్ లా అనేది పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తమిళనాడులో ఇసుక రీచ్‌లలో జరిగిన అక్రమాలపై విచారిస్తున్న ఈడి రాష్ట్రంలో కూడా విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అంబేద్కర్‌సెంటర్‌లో ధర్నా చేస్తున్న జనసేన కార్యకర్తలు

జనసేన కార్యకర్తల నిరసన

మేయర్ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం జనసేన చలో గుంటూరుకు పిలుపునిచ్చింది. దీంతో ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా జనసేన నాయకులను గృహనిర్బంధం చేశారు. పోలీసుల వైఖరిని జనసేన నాయకులు ఖండించారు. పవన్ కల్యాణ్‌పై మేయర్ మనోహర్ నాయుడు చేసినవ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్‌సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. తాము మేయర్ ఇంటిని ముట్టడిస్తామని వారు సిద్ధం కాగా కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుఅధికారులు సర్ధిచెప్పారు. సిఎంజగన్, మేయర్ కావటి మనోహర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టిడిపి నాయకులు కూడాజనసేననాయకులకు సంఘీభావం తెలిపారు.

క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు

మేయర్ కావటి మనోహర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పవన్ కల్యాణ్, నారా లోకేష్ పై తానుచేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని తాను క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ గతంలో పవన్ కల్యాణ్ సిఎం జగన్‌పై ఎన్నో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆనాడు ఎంతోమంది అభ్యంతరం పెట్టారని కానీ పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పారా అని ప్రశ్నించారు. వైసిపినేతలకు చెప్పు చూపించి పవన్‌కల్యాణ్ బూతులు తిట్టారని ఆయనకు లేని విచక్షణ తమకే అవసరమా అని ప్రశ్నించారు. తానుఎవరికి క్షమాపణ చెప్పనని స్పష్టం చేశారు. జనసేనవారు చేస్తున్న రాద్ధాంతంను ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసునన్నారు. ఎమ్మెల్యే మద్దాలి గిరి మాట్లాడుతూ జనసేన, టిడిపినాయకులు చేస్తున్న విమర్శల్లో పసలేదన్నారు. నిత్యం సెటిల్‌మెంట్స్ చేసే టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర తమపై పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏమిటన్నారు.

వ్యవస్థలను మ్యానేజ్ చేసేదీ మీరే

దమ్ముంటే మళ్లీ పాదయాత్ర చేయాలి : సిఎం జగన్‌కు మాజీ ఎమ్మెల్యే యరపతినేని సవాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు నాయుడు వ్యవస్థలను మ్యానేజ్ చేస్తారని వైసిపి తప్పుడు ప్రచారం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. గుంటూరులోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌లో వేలాది మందికి శిక్షణ ఇచ్చి ఎప్పుడో ఆరేళ్ల క్రితం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే అక్రమాలు జరిగాయని ఇప్పుడు చంద్రబాబుపై కేసు నమోదు చేసి జైలుకు పంపడం వెనుక ఎవరు వ్యవస్థలను మ్యానేజ్ చేస్తున్నారో తెలుస్తుందన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అప్పటికప్పుడు జతచేసి అరెస్టు చేయడంలో జగన్ ఎవరిని మ్యానేజ్ చేశారని ప్రజలకు తెలుసన్నారు. ఆర్థిక నేరాల్లో 10 ఏళ్లుగా బెయిల్‌పై ఉండి వ్యవస్థలను మ్యానేజ్ చేసింది జగన్ కాదా అని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ స్వయంగా ఎంపి అవినాష్ రెడ్డి పాత్ర ఉందని నిర్ధారించినా అరెస్టు కాకుండా వ్యవస్థలను జగన్ ఎలా మ్యానేజ్ చేశారో తెలుగు ప్రజలంతా చూశారని అన్నారు. చంద్రబాబు, లోకేష్ లను పాతాళానికి తొక్కేస్తానని చెబుతున్న సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు వైసిపి నాయకులను, సిఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో అథహ పాతాళానికి తొక్కివేయడానికి రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. సంక్షేమ పథకాలు గొప్పగా అమలుచేశానని చెప్పుకుంటున్న జగన్ పోలీసులు లేకుండా ఇప్పుడు ప్రజల్లోకి వచ్చి పాదయాత్ర చేయాలని సవాల్ చేశారు. ప్రజల నుంచి వ్యతిరేకత వల్లే రెండుకిలో మీటర్లు కూడా రోడ్డు మార్గంలో ప్రయాణించలేక ఎక్కడికి వెళ్లినా పరదాలు కట్టుకోవడం సిఎం జగన్‌కు చెల్లిందన్నారు. దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చంద్రబాబును కక్షసాధింపుతో తాత్కాలికంగా ఇబ్బందిపెట్టవచ్చునని దీర్ఘకాల ంలో వైసిపి నాయకులు అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి కుమార్డు భార్గవ రెడ్డి సోషల్ మీడియాలో టిడిపి నేతల కుటుంబాల గురించి, మహిళల గురించి అసభ్యంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని అతనిపై త్వరలోనే తగిన చర్యలు ఉంటాయన్నారు. రాజమండ్రి జైల్లో చంద్రబాబుకు ప్రాణహాని ఉందన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న యరపతినేని